క్లుప్తంగా

ఎస్పీ గారు.. శాంతిభద్రతలు పరిరక్షించండి

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ వినతి



నరసరావుపేట: జిల్లా ఎస్పీగా నియమితులైన కంచి శ్రీనివాస రావును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువా కప్పి సత్కరించారు. జిల్లాలో శాంతిభద్రతలు, గంజాయి మాఫియాపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజా సమస్యల విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఆ మేరకు పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కపిలవాయి విజయ్‌కుమార్, గాడిపర్తి సురేష్, మహమ్మద్ రఫీ, ఖాసీం పాల్గొన్నారు.

నేడు కనపర్రులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల: మండల పరిధిలోని కనపర్రు గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు.

ఎవరో.. గుర్తుతెలియని మృతుడు?



వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని పెద కంచర్ల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, పిల్లలు కనిపించడం లేదు!

నరసరావుపేట టౌన్: భార్య, పిల్లలు కనిపించటం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన కొలిశెట్టి సాంబశివరావు కిరాణ దుకాణం నిర్వహిస్తూ ఉంటాడు. గత కొన్ని రోజులుగా భార్య గీతతో మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో గీత తన కుమారుడు, కుమార్తెను తీసుకొని ఈ నెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. వారి కోసం గాలించినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భవిత కేంద్రాలు ఉపయోగించుకోవాలి

చిలకలూరిపేట: భవిత కేంద్రాలను ఉపయోగించుకోవాలని జిల్లా ఐఈడీ కో ఆర్డినేటర్ ఆర్ సెల్వ రాజ్ చెప్పారు. పట్టణంలోని డాక్టర్ మద్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే నిర్వహించి అన్ని ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించాలని చెప్పారు. భవిత కేంద్రంలో శిక్షణ అనంతరం రెగ్యులర్ పాఠశాలల్లో చేర్చాలని సూచించారు. హియరింగ్ స్పీచ్ పరికరాలు, ట్రాలీలు అందించటం జరుగుతుందన్నారు. రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ఐఈడీ ఉపాధ్యాయులు కె.విశ్వప్రసాద్, ఎ.అప్పారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పది లక్షల సభ్యత్వమే లక్ష్యం

నరసరావుపేట: పది లక్షల సభ్యత్వాలు నమోదు చేయడమే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సంకల్పమని, ఆ దిశగా జన సైనికులు సభ్యత నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని పేర్కొన్నారు. గురువారం జనసేనపార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కోనిశెట్టి నాగశ్రీను, నిశంకర శ్రీనివాస్ (వినుకొండ) తోట రాజారమేష్, పెండ్యాల బాలాజీ (చిలకలూరిపేట), భూత రామాంజనేయులు(మాచర్ల), కటకం అంకారావు, షేక్ ఖాసిం (గురజాల), నరసరావుపేట పట్టణ అధ్యక్షులు జీవీఎస్.ప్రసాద్, రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సెక్రెటరీ వీరవల్లి వంశీ, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి షేక్ అఫ్రుప్, రొంపిచర్ల మండల అధ్యక్షులు అచ్చుల సాంబశివరావు, పట్టణ యువజన అధ్యక్షులు మీనా దినేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కుష్ఠు వ్యాధిపై అవగాహన

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్ర పరిధిలోని రెడ్డిపాలెం, మర్రిచెట్టుపాలెం, విప్పర్ల గ్రామాల్లో వైద్య సిబ్బంది గురువారం కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్యశాల సిబ్బంది ఈ కార్యక్రమం ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సురేష్ కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు కార్డుల జారీపై అవగాహన సదస్సులు

నరసరావుపేట: ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారు కార్డు (సీసీఆర్‌సీ) జారీపై అవగాహన కోసం ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతుసేవ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న సదస్సుల్లో కౌలు రైతులు, భూ యజమానులు పాల్గొనేలా సహకరించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్(డీబీఆర్‌సీ) కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, తహసీల్దారు హరిబాబులకు వారి కార్యాలయాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద నుంచి ఆటో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తిరిగి పంట సాగుదారుల కార్డుదారులందరికీ ఇప్పించాలనే ధ్యేయంతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సిటీ కోఆర్డినేటర్ తోకల సాంబయ్య, ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటి రత్నం పాల్గొన్నారు.

కాల్వల్లో పైపులు స్వచ్ఛందంగా తొలగించుకోండి

- గృహ యజమానులకు కమిషనరు సూచన
- లేనిపక్షంలో ప్రజారోగ్య రక్షణ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



పాతూరు శివాలయం వీధుల్లో మురుగుకాలువల శుభ్రాన్ని పరిశీలిస్తున్న కమిషనరు రవిచంద్రారెడ్డి

నరసరావుపేట: ప్రతి గృహానికి తాగునీరు అందజేసే కుళాయిలు మురుగుకాలువల మీదుగా వచ్చి ఉంటే అటువంటి వాటిని వాటి యజమానులే స్వచ్ఛందంగా తొలగించి మరోచోట ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి సూచించారు. లేనిపక్షంలో ప్రజారోగ్య రక్షణ చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం 28వ వార్డు పాతురు శివాలయం పరిసర ప్రాంతాల్లో మురుగు కాలువల క్లీనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో కొన్ని గృహాలవారు తమ ఇంటి నీటి కుళాయి కనెక్షన్ కాలువ మీద నుంచి, మరికొన్ని కాలువల్లో నుంచి రావడం గమనించి సదరు ఇంటి యజమానిని పిలిపించి పై సూచనలు చేశారు. అందుకు సంబంధించి పురపాలక ఇంజినీరింగ్ సిబ్బందికి తెలియచేస్తే వాళ్లు వచ్చి వాటిని కాల్వకు దూరంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. లేకుంటే కాలువలోని నీరు మంచినీరు రెండు కలిసి డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. స్వచ్ఛందంగా ఎవరికి వారే గమనించి నడుచుకోవాలని, లేకుంటే ప్రజా ఆరోగ్య రక్షణ సంబంధించి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్క వార్డు సచివాలయం సెక్రటరీలు తమ సచివాలయం పరిధిలో ఉన్నటువంటి డ్రెయిన్‌లను పరిశీలించి తాగునీరు కలుషితం కాకుండా మంచి నీటి పైపులైనులు కాలువలు మీద ఉన్నట్లయితే వాటిని దూరంగా ఉంచే విధంగా ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలు సమన్వయంగా పనిచేయాలని ఆదేశించారు.

25, 26వ వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన

శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి, అధికారులతో కలిసి 25, 26వ వార్డుల్లో పర్యటించారు. పెద్ద చెరువు బైపాస్‌రోడ్‌లో ఉన్న ఇందిరాగాంధీ బొమ్మ పరిసర ప్రాంతాలను పరిశీలించి బొమ్మచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసి ఐరన్ స్టీల్‌తో సేఫ్‌గార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం 25వ వార్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పర్యటిస్తూ ఆ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్క సంస్థ యజమానులు తమ కంపెనీ చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిచ్చి మొక్కలను తొలగించుకోవాలని, ముఖ్యంగా ఎన్జీవో కాలనీకు వెళ్ళేటటువంటి ప్రజలు ఈ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మార్గం నుంచే వెళ్లాల్సి ఉన్నందున ఆ రోడ్డు, కాలువలు, వీధిదీపాలు సంబంధించి ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. అందుకు సంబంధించి మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసుకుంటూ వారికి సూచనలు ఇవ్వాలని కమిషనర్‌కు సూచించారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ నాయక్, వార్డు సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కక్ష సాధింపునకు ఆక్రమణల సాకు..!

యడ్లపాడులో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల షాపుల తొలగింపునకు చర్యలు

గుంటూరు: వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై కక్ష సాధింపు చర్య మొదలైంది. ఆక్రమణ సాకు చూపుతూ జీవనాధారంపై దెబ్బతీసేందుకు అధికార పార్టీ వర్గీయులు ప్రయత్నిస్తున్నారంటూ బాధితులు వాపోతున్నారు. యడ్లపాడు మండల కేంద్రం హైవే పక్క షాపుల్ని తొలగించాలంటూ ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు సదరు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హైవే సర్వీసు మార్గం వెంబడి ఉన్న బడ్డీబంకుల్ని తొలగించేందుకు ఆశాఖ అధికారుల బృందం గురువారం విచ్చేసింది. సత్వరమే బడ్డీబంకుల్ని తొలగించాల్సిందేనంటూ జేసీబీ వాహనాలతో చర్యలకు యత్నించారు. కేవలం తమ దుకాణాల్ని మాత్రమే కాదు... సర్వీసు మార్గంలోని ఆక్రమణలన్నింటినీ తొలగించాలంటూ పట్టుబడ్డారు. ముందుగా కొత్తూరు వైపు నుంచి రాజీవ్‌గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఉన్న షాపుల్ని తీసి వేయాలని, మిగిలిన వాటి సంగతి తర్వాత చూస్తామనడంతో అధికారులు, బాధితుల మధ్య వాగ్వాదం జరిగింది. వివాదం కాస్తా సమీపానే ఉన్న పోలీస్‌స్టేషన్‌కు చేరింది. గ్రామస్తులే ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వాటిని తొలగించేందుకు వచ్చినట్లు పోలీసులకు హైవే ప్రతినిధులు తెలిపారు. అయితే ముందుగానే వారికి మౌఖికంగా సమాచారం ఇచ్చామని, స్పందించని కారణంగా తొలగించేందుకు వచ్చినట్లు పోలీసులకు తెలిపారు. బాధితుల వద్ద ఆధారాలు ఏమున్నాయని పోలీసులు అడగ్గా తాము ఏళ్ల తరబడి వీటిపై జీవిస్తున్నామని, తమ వద్ద పంచాయతీకి చెల్లిస్తున్న పన్ను, లైసెన్స్‌లను చూపించారు. కేవలం 12 షాపుల్నే తొలగిస్తామని మార్కింగ్ చేయడం అన్యాయమన్నారు. ఇది కక్షసాధింపు చర్యేనంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపు విషయం సున్నితమైన అంశమన్నారు. వివాదం ముదిరితే శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి చర్యలకు చేపట్టే ముందుగా పోలీసు, రెవెన్యూ, పంచాయతీ శాఖలకు ముందస్తు సమాచారం ఇచ్చి రావాలన్నారు. ప్రస్తుతం సిబ్బంది తక్కువగా ఉన్నందున ఫోర్సు ఇవ్వలేమని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫోర్సు ఎప్పుడివ్వాలో నిర్ణయిస్తామని హైవే అధికారులకు తెలిపారు. దీంతో హైవే అధికారులు తొలగింపు చర్యలను వాయిదా వేసి వెనుదిరిగి వెళ్లారు. అయితే ఈ విషయంపై విచారణ చేసేందుకు శుక్రవారం హైవే పీడీ రానున్నట్లు అధికారులు వెల్లడించారు. అధికారులు ద్వంద్వవైఖరీని చూపకుండా సమన్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయంపై హైవే భద్రతాధికారి షేక్ ఆరీఫ్‌ను వివరణ కోరగా తమకు చెందిన భూముల్లోని ఆక్రమణలో ఉన్న అన్ని షాపుల్ని తొలగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి గొట్టం వెంకటనాయుడు, సర్వే మేనేజర్ సత్యం పాల్గొన్నారు.

కోదండరాముడికి ప్రత్యేక పూజలు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా రెండో రోజు భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి దర్శి ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, గోత్రనామ పూజలు జరిగాయి. వెయ్యి రూపాయి నాణేలతో తయారు చేసిన దండతో స్వామివారికి అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కెల్లంపల్లి సుందరరావు, కార్యదర్శి కెల్లంపల్లి అచ్చయ్య, ఉపాధ్యక్షుడు ఐతా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గాలి బుచ్చయ్య, పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో -1

రొంపిచర్ల : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో-1 గా పి.హవీలా గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె వినుకొండ బాయ్స్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఎంఈవో-1గా పనిచేసిన కె.పి. బాబురెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆమెను నియామకం చేశారు. నూతన ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరించిన హవీలాను ఎంఈవో-2 డి.బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

21న రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రోటరీక్లబ్ నూతన కార్యవర్గ అధ్యక్షునిగా కపలవాయి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా సాతులూరు శివ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఈనెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు బరంపేటలోని శ్రీపాద కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మేళ్లచెర్వు సుమిత్రకుమార్ గురువారం తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆత్మ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమల కుమారి, ఏడీఏ మస్తానమ్మ, డీడీఏ శివకుమారి హాజరయ్యారు. అమల కుమారి మాట్లాడుతూ ప్రతి రైతు ప్రధాన పంట వేయడానికి ముందు 30 రకాల విత్తనాలు భూమిలో చల్లి 45 రోజుల తరువాత దాని లభించే ఆకుకూరలు, కూరగాయలు ఉపయోగించుకోవాలన్నారు. మిగిలినవి దానిలో కొంత పశువుల మేతగా, భూమి సారవంతం కోసం మరికొంత భూమిలో కలియ దున్నాలన్నారు. శివకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు పెట్టుబడి తగ్గించుకునేందుకు ఫెర్టిలైజర్ బదులుగా జీవన ఎరువులు ఉపయోగించాలని అంతర పంటలు విధానం పాటించాలన్నారు. మస్తానమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు జీవన ఎరువులు అంతర పంటల విధానం పాటించడం వలన రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి రైతుల నికర ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం పీఎండీఎస్ వేసిన రైతు సురేష్ పంట పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ సుబ్బారావు, గ్రామపెద్దలు సింగారెడ్డి కోటిరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రమశిక్షణ కూడా నేర్పండి



విద్యార్థులకు మెలకువలు వివరిస్తున్న రేవతి

ఈపూరు: విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ అలవాటు చేసేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జీసీడీవో రేవతి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి వేరే పాఠశాల విద్యార్థులు బయట నిలబడి వర్షంలో తడుస్తుండటంతో పీఈటీ ఝాన్సీ వారిని లోపలికి రమ్మన్నందుకు వేరే విద్యార్థులను లోపలికి ఎలా రానిస్తామని వాచ్‌మెన్ మరియమ్మ అడ్డుకుంది. దీంతో వారిద్దరి మధ్య తోపులాట జరిగింది. ఈ విషయాన్ని పాఠశాల ప్రత్యేక అధికారి జ్యోతి డీఈవోకు ఫిర్యాదు చేయడంతో డీఈవో ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు ఆమె తెలిపారు. విచారించిన అనంతరం ఇరువురి వద్ద నివేదిక తీసుకొని ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు జీసీడీవో రేవతి పేర్కొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో క్రమశిక్షణతో పాటు మంచి విద్యను అందించడమే కస్తూర్బా పాఠశాలల లక్ష్యమని, జిల్లాలోని అనేక పాఠశాలల్లో గత పదో తరగతి ఉత్తీర్ణత శాతం బాగుందని, ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇక్కడ జరిగిన సంఘటనపై ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు.

వినుకొండలో సాధు సంతుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న హిమాలయ గురువు

వినుకొండ(నూజెండ్ల): శాంతి ఆశ్రమం ట్రస్ట్, హిమాలయ గురువు ఆధ్వర్యంలో తొలి ఏకాదశి తృతీయ అఖండజ్యోతి ప్రజ్వలన మన రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 108 మంది సాధుసంతులు విచ్చేసి నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన సమావేశంలో అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం సర్వలోక కల్యాణార్థమై జరిపించామని, రైతులు, వ్యాపారుల కార్మికులు ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భూగర్భ జలాలు పెరిగి ప్రకృతి పచ్చదనంతో పరవశించాలన్నారు. అనంతరం సాధు సంతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు కనిగండ్ల కోటేశ్వర రావు, పెండేల పుల్లారావు, కాశీ, సురేష్, ఆర్ఎస్ఎస్ తరఫున కాశీ, గజవల్లి పవన్, భాగవత్ రవికుమార్ సారథ్యం వహించారు. కడప జిల్లా కంది మల్లాయపల్లె బ్రహ్మంగారి మఠం వీరబ్రహ్మేంద్ర స్వామి 8వ తరం ముని మనవడు నొస్సం వీరంభట్లయ్య స్వామి పాల్గొన్నారు.

బీసీజీ టీకా వేయించుకోవాలి

శావల్యాపురం: టీబీ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా బీసీజీ టీకా వేయించుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు, షుగర్, సిగిరేట్లు తాగేవారు, 60 సంవత్సరాల పైబడిన వారందరు బీసీజీ టీకా చేయించుకోవటం ఆరోగ్యకరంగా చాలా మంచిదన్నారు. అలాగే భవిష్యత్‌లో క్షయ వ్యాధి నియంత్రణకు దోహదపడుతుందన్నారు. గతంలో క్షయ వ్యాధి బారిన పడి ప్రస్తుతం మందులు వాడుకునే వారందరూ ఈటీకా చేయించుకోవాలన్నారు. ఈ టీకా వల్ల ఎలాంటి సైడు ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ఎత్తుకు తగిన బరువు లేని వారందరూ కూడా ఈటీకా కూడా చేయించుకోవాలన్నారు. ఇంటింటికీ ఆరోగ్య ఆశ కార్యకర్తలు తిరిగి షుగర్, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి బీసీజీ టీకాపై అవగాహన కల్పించి తదుపరి టీకా చేయాలన్నారు. ఇప్పటి వరకు మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 2500 మందికి బీసీజీ టీకాను వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది పర్యవేక్షణలో చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్నఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువుల వితరణ

నాదెండ్ల: కనపర్రు గ్రామ పరిధిలోని హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువైన సామగ్రిని అంగన్‌వాడీ కేంద్రాలకు అందించారు. సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, సీడీపీవో శాంతకుమారి, కంపెనీ బ్రాంచి మేనేజర్ గుత్తా రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ సంస్థ తరఫున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంతయ్య, గ్రామ పెద్దలు వజ్జా సింగయ్య, ఎం.జయప్రసాద్, చెన్నయ్య, సూపర్‌వైజర్‌లు ఉషారాణి, రేవతి పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

చిలకలూరిపేటటౌన్: పట్టణానికి తాగునీరు అందించే చెరువులో యువకుడు పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని సుగాలీకాలనీకు చెందిన కేతావత్ హనుమానాయక్(35), మరో ముగ్గురు మిత్రులతో కలిసి 52 ఎకరాల భూముల సమీపంలోని పాత మంచినీటి చెరువులో చేపలు పట్టేందుకు బుధవారం మధ్యాహ్నం వెళ్లాడు. ఈ నేపథ్యంలో నీటిలోకి దిగిన హనుమానాయక్ ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రవికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మరుసటి రోజు శవమై తేలిన హనుమా నాయక్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. హనుమానాయక్‌కు 15 ఏళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. దంపతుల మధ్య మనస్పర్థలతో ఐదేళ్ల క్రితం విడిపోయారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కుష్ఠు వ్యాధి సర్వే ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని అన్నీ గ్రామాలో కుష్ఠు వ్యాధి సర్వే కార్యక్రమం ప్రారంభమైనట్లు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ తెలిపారు.

పదో తరగతిలో సత్తా చాటాలి

- క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించండి
- గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాదాత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: విద్యాభ్యాసంలో పదో తరగతి మైలు రాయి వంటిదని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. తరగతి గదిలో వారితో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి పోటీతత్వంలో పరీక్షలు రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ఇంటికి వెళ్లి నెమరువేసుకోవాలన్నారు. దీంతో పాఠ్యాంశాలు చక్కగా గుర్తుండి పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చన్నారు. పదిలో మంచి మార్కులతోసత్తా చాటి ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. పది పూర్తయిన విద్యార్థులు గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్ చదువుకునే వెసులుబాటు ఉందన్నారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతో పాటూ హెచ్‌ఎం సుందరరావు, గ్రామ పెద్దలు యన్నం శివారెడ్డి ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించటం అభినందనీయం

ఈ ఏడాది ట్రిపుల్ ఐటీలో నలుగురు విద్యార్థులు సీట్లు సాధించటం గ్రామానికే గర్వకారణమని విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సీట్లు సాధించి జెల్దిచెర్రీ, సరిమెళ్ళ జాన్‌జోయల్, దంతం గాయత్రి సంజీవని, షేక్ ముబీనాలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో ప్రారంభమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరుసగా ఆరుసార్లు నూరు శాతం ఫలితాలు సాధించిందన్నారు. ఈ ఏడాది 61 మంది విద్యార్థులకు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. 500 మార్కులకు పైగా 45 మంది విద్యార్థులు సాధించటం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయటమే ఫలితాలకు నిదర్శనమన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మొక్కలు నాటుతున్న శ్రీదేవి

బొల్లాపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ వి.శ్రీదేవి మాతృమూర్తులకు సూచించారు. మండలంలోని రేమిడిచర్ల సచివాలయ పరిధిలో వీవీ చెంచుకాలనీలో మిషన్ శక్తి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ సెంటర్‌లో సీజనల్ వ్యాధుల పట్ల తల్లులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ.. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఇళ్లల్లో, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి అనారోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు జీవితాన్ని అంకితం చేసిన మోహన్



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చెరుకుపల్లి నిర్మల

చిలకలూరిపేట: జీవితకాలం పేదల సమస్యల పరిష్కారంకోసం పాటుపడిన యోధుడు సీఆర్ మోహన్ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ ఏరియా కార్యవర్గ సభ్యురాలు చెరుకుపల్లి నిర్మల చెప్పారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు సీఆర్ మోహన్ మూడో సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం సహకరించకున్నా పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమంలో పాల్గొన్న క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన నాయకుడు అని కొనియాడారు. ఏ సమయంలో ఏ పేదవాడు వచ్చి సమస్య ఉందని చెబితే వెంటనే స్పందించి రంగంలోకి దిగేవారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దాసరి వరహాలు, సీఆర్ సృజన్, నరసింహ భారతి, శానం యలమంద, పోలయ్య పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



వి.రెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రొంపిచర్ల: గత ఏడాది ఖరీఫ్‌లో ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కరువు పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోయిన నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీగా వచ్చి సచివాలయాలల్లో వినతి పత్రాలు అందించారు. రైతు సమస్యలపై రాయబారం పేరిట రైతు సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రొంపిచర్లలో మొదలైన ద్విచక్ర వాహన ర్యాలీ రామిరెడ్డి పాలెం, బుచ్చిపాపన్నపాలెం, గోగులపాడు, సంతగుడిపాడు, రెడ్డిపాలెం, విప్పర్ల, మాచవరం, నల్లగార్లపాడు, పరగటిచర్ల గ్రామాలలో కొనసాగింది. ఆయా సంఘాల నాయకులు వర్షంలో సైతం ర్యాలీ నిర్వహించి ఆయా గ్రామాలలో గ్రామ సచివాలయాలలో వినతి పత్రం అందజేసి సచివాలయాల ఎదుట రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం సాగుదారులలో 70 శాతం మందికి పైగా కౌలు రైతులే భూములు సాగు చేస్తున్నారన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక భూయజమానులు సాగుకు ముందుకు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సాగుకు ఉపక్రమిస్తున్న కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలకు రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గుర్తు చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నష్టపోయిన రైతులను ఆదుకోవడంతోపాటు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ నాయక్‌లు పాల్గొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



ర్యాలీలో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి, న్యాయవాదులు

చిలకలూరిపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు, ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం వలన వాహనదారుడితో పాటు వారి కుటుంబానికి రక్షణ లభిస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ధరించని సందర్భంలో తలకు గాయం కావడం వల్లే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని హెచ్చరించారు. ఈ ప్రమాదం నుంచి రక్షణ పొందేందుకు హెల్మెట్‌ను ధరించటం బాధ్యతగా భావించాలని చెప్పారు. ర్యాలీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణం నుంచి ప్రారంభమై ఎన్ఆర్‌టీ సెంటర్, కృష్ణమహల్ సెంటర్, కళామందిర్ సెంటర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ నాగలక్ష్మి, న్యాయవాదులు, పోలీసులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.